సాక్షి
ప్రకాశం

సోమవారం । 6 । నవంబర్ । 2023



లాభాల పరిమళం

జిల్లాలో పూలసాగు రైతులకు లాభాలు కురిపిస్తోంది. జిల్లాలో 108.44 ఎకరాల్లో పూలసాగు జరుగుతోంది. పెళ్లిళ్లసీజన్‌తో పాటు రాబోయే కార్తీక మాసంలో గిరాకీ పెరగనుంది. - 8లో..



బస్సు యాత్ర విజయవంతం చేద్దాం

వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం చేయాలని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ కోరారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
30.1/25.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు బాలినేని పర్యటన



ఒంగోలు సెంట్రల్: మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి ఒంగోలు వస్తారని బాలినేని కార్యాలయ ప్రతినిధి తెలిపారు. తర్వాత షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

ఎంపీ విజయసాయిరెడ్డికి ఘన స్వాగతం



ఎంపీ విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు సెంట్రల్: మార్కాపురంలో సోమవారం నిర్వహిస్తున్న సామాజిక సాధికార యాత్రలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎంపీ విజయ సాయిరెడ్డికి ఆ పార్టీ యువ నాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. ఆదివారం రాత్రి డిల్లీ గేట్ వే హోటల్ వద్ద ఆహ్వానం పలికారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

నేటికి పాదయాత్ర పూర్తయి ఆరేళ్లు

- నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వేడుకలు

ఒంగోలు సెంట్రల్: జననేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర పూర్తి చేసి ఆరు సంవత్సరాలు అయిన సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నగర అధ్యక్షుడు కటారి శంకర్‌రావు తెలిపారు. కార్యక్రమానికి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించి నాటి పాదయాత్ర, నేటి జగనన్న సుపరిపాలన గురించి గుర్తు చేస్తూ కేక్ కటింగ్ చేస్తారని చెప్పారు. పార్టీ నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

బండారు రామారావుకు ఘన నివాళులు



బండారు రామారావుకి నివాళులర్పిస్తున్న కళాకారులు

ఒంగోలు మెట్రో: నట చూడామణి బిరుదాంకితుడు బండారు రామారావు అని పలువురు వక్తలు కొనియాడారు. బండారు రామారావు 47వ వర్ధంతి కార్యక్రమం ఒంగోలు నెల్లూరు బస్టాండ్ సెంటర్ ఆయన విగ్రహం వద్ద బండారు రమా నాట్యమండలి అధ్యక్షుడు అల్లూరు శాంతారావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో విగ్రహ కమిటీ కార్యదర్శి ప్రకాశం మాట్లాడుతూ తెలుగు ప్రజలు ఉన్నంత వరకు బండారు రామారావును గుర్తుంచుకుంటారని అన్నారు. సీనియర్ కళాకారులు ఐఓబీ బ్యాంకు మేనేజర్ కనకమాల రాయపాలు మాట్లాడుతూ పద్యం ఉన్నంత కాలం సత్య హరిశ్చంద్ర నాటకం బతికే ఉంటుందన్నారు. బండారు రామారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

నవ భారత నిర్మాణం కోసం కలిసి అడుగేద్దాం

- కెనరా బ్యాంకు వాకథాన్‌లో డిప్యూటీ జనరల్ మేనేజర్ మంజునాథ్

ఒంగోలు టౌన్: నవ భారత నిర్మాణం కోసం భారత ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా కలిసి నడుద్దామని కెనరా బ్యాంకు సర్కిల్ ఆఫీస్ డిప్యూటీ మేనేజర్ మంజునాథ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఒంగోలు మంగమూరు కెనరా బ్యాంకు బ్రాంచి నుంచి భాగ్యనగర్ వరకు వాకథాన్ నిర్వహించారు. వాకథాన్‌లో పెద్ద సంఖ్యలో కెనరా బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు. విజిలెన్స్ వారోత్సవాలను పురస్కరించుకొని ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో వాకథాన్ నిర్వహించినట్లు తెలిపారు. దేశ ప్రగతికి అడ్డంకిగా మారిన అవినీతికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని, అవినీతిని పూర్తిగా నిర్మూలించాలన్న ఉద్దేశంతోనే విజిలెన్స్ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజాపరిపాలనలో సమగ్రత, పారదర్శకత, జవాబుదారితనాన్ని పెంపొందించడానికి సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ వివిధ కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఎన్ మారుతి శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతకు నమ్మకం

రైతులను అన్నివిధాలా ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగులో ప్రతి దశలోనూ అండగా నిలుస్తోంది. కల్తీకాటు నుంచి రైతులను రక్షించేందుకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేందుకు పక్కాగా చర్యలు చేపట్టింది. నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ప్రాథమిక దశలోనే గుర్తించేలా ప్రతి నియోజకవర్గానికి డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేసింది. వాటిలో రైతులకు ఉచితంగా సేవలందిస్తోంది. భూసార పరీక్షలను కూడా నిర్వహించుకునే అవకాశం కల్పించింది. జిల్లాలో దాదాపు లక్ష మందికిపైగా రైతులు వీటి వల్ల లబ్ధిపొందొచ్చు.



సంతనూతలపాడులోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్

- ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతా పరీక్షలు
- నాసిరకం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు చెక్
- జిల్లాలో దాదాపు లక్ష మంది రైతులకు అందుబాటులో సేవలు

చీమకుర్తి: నాసిరకం విత్తనాలని తెలియక సాగు చేసి మొలకల కోసం నెలల పాటు ఎదురు చూసిన రైతులున్నారు. మొలకెత్తినా పంట చేతికొచ్చే దశలో పూత రాలేదనో, కాయ కాయలేదనో తెలుసుకొని సాగు కాలం పూర్తయ్యేసరికి పెట్టిన పెట్టుబడి నేల పాలైన విషయాన్ని గ్రహించి ఆవేదనతో గుండెలు ఆగిన రైతులు ఎందరో ఉన్నారు. విత్తనాలు మంచివి నాటినా తెగుళ్ల నివారణకు వాడిన పురుగు మందులు కల్తీవని తెలియక తీరా పంట పూర్తిగా నాశనమయ్యే సరికి పుణ్యకాలం కాస్త గడిచిపోయేది. చివరకు తెచ్చిన అప్పులు తడిసి మోపెడై భారంగా మారటంతో తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకునేవారు. వ్యవసాయం చేయాలంటే లాభాల సంగతి దేవుడెరుగు కనీసం పెట్టిన పెట్టుబడి వస్తుందో రాదోననే నమ్మకాన్ని రైతులు కోల్పోయిన దశలో అధికారంలోకి వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి భరోసా కల్పించారు. రైతులు సాగు చేసే పంటలకు ప్రాథమిక వనరులైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను నాణ్యమైన వాటిని అందించాలనే ఉద్దేశంతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేరుతో ప్రతి నియోజకవర్గానికి 'డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్'ను ఏర్పాటు చేశారు.

రైతులకు అందుబాటులోనే నాణ్యతా పరీక్షలు: గత ఏడాది వరకు రైతులు సాగు చేసే పంటలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను తెలుసుకోవాలంటే నమూనాలు సేకరించిన వ్యవసాయాధికారులు వాటిని రాష్ట్రంలోని వైజాగ్, గుంటూరు, తిరుపతి, అనంతపురం వంటి సుదూర ప్రాంతాలకు పంపించి అక్కడ ఉన్న ల్యాబ్‌లలో నాణ్యతను పరీక్షించే వారు. వాటి నివేదికలు వచ్చేసరికి వ్యవసాయ సీజన్ కాస్త ముగిసిపోయేదని రైతులు ఆందోళనలు వ్యక్తం చేసేవారు. అంత జాప్యం లేకుండా ఉండేందుకు ఎక్కడికక్కడే నియోజకవర్గానికి ఒకటి చొప్పున అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. రైతులకు విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నాణ్యతపై ఏమాత్రం అనుమానం వచ్చినా వెంటనే సమీపంలోనే ఉన్న టెస్టింగ్ ల్యాబ్‌లలో పరీక్షలు చేయించుకున్న తర్వాత వాటి నాణ్యతను బట్టి రైతులు పంటలను నమ్మకంగా సాగు చేసుకునే అవకాశం కల్పించారు. వ్యవసాయాధికారులు కూడా కొన్ని నమూనాలను పరిశీలించి డీకోడింగ్‌కు పంపించాల్సి ఉండేది. గతంలో సుదూర ప్రాంతాలకు పంపించటం వలన జాప్యం జరుగుతుండేది. ఇప్పుడు వ్యవసాయాధికారులు సేకరించిన నమూనాలను జిల్లాలోనే టెస్టింగ్ ల్యాబ్‌లకు పంపించి వాటి నాణ్యత నివేదికలను సకాలంలో సేకరిస్తున్నారు.

నియోజకవర్గానికి ఒక టెస్టింగ్ ల్యాబ్: జిల్లాలోని సంతనూతలపాడు, దర్శి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, సింగరాయకొండ, యర్రగొండపాలెంలలో అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. ఒంగోలులో జిల్లా ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. దాదాపు కోటి రూపాయల వ్యయంతో నిర్మించిన ఒక్కొక్క అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో సాంకేతిక పరికరాలు, ఫర్నిచర్, కెమికల్స్‌ను ఏర్పాటు చేశారు. వాటిలో ఇప్పటికే కనిగిరి, సింగరాయకొండలలోని టెస్టింగ్ ల్యాబ్‌లు పూర్తిగా వినియోగంలోకి వచ్చాయి. యర్రగొండపాలెం, దర్శి, గిద్దలూరు, సంతనూతలపాడు కేంద్రాల్లోని అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లు నిర్మాణాలు పూర్తి చేసుకొని ప్రారంభోత్సవాలయ్యాయి. వాటికి టెస్టింగ్ మెటీరియల్స్, కెమికల్స్ రావాల్సి ఉంది. అవి కూడా ఒకటి రెండు నెలల్లో నాణ్యతా పరీక్షలు ప్రారంభించేందుకు జిల్లా అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. ఒక్క మార్కాపురంలో మాత్రం స్థలం అందుబాటులో లేక ఇప్పటి వరకు నిర్మాణంలో జాప్యం జరిగింది. స్థలం సమస్య కూడా పరిష్కారమైనట్లు అధికారులు తెలిపారు. త్వరలో దాని నిర్మాణం కూడా పూర్తి చేయనున్నట్లు చెప్పారు. వాటి నాణ్యతను తెలుసుకునేందుకు రైతులు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు. డీలర్లు, ప్రైవేటు కంపెనీల వారు మాత్రం టెస్టింగ్ సమయంలో వాటి పరిమాణాన్ని బట్టి రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది.



భూసార పరీక్ష నిర్వహిస్తున్న టెక్నీషియన్(ఫైల్)

ఎలాంటి పరీక్షలు చేస్తారంటే..

- జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్‌లలో అన్ని రకాల పంటలు సాగు చేసే రైతులు దాదాపు లక్ష మందికి పైగా ఉన్నట్లు వ్యవసాయాధికారుల అంచనా. జిల్లాలో ఎక్కువగా సాగుచేసే వరి, కంది, జనుము, మినుము, పెసర, పిల్లి పెసర, జీలుగ, అలసందలు వంటి విత్తనాలను ప్రభుత్వమే రాయితీపై రైతులకు అందిస్తుంది. మొలక శాతాన్ని పరీక్షించి నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం అందిస్తోంది. వాటినే రైతులకు అదనంగా కావాల్సి ఉంటే ప్రైవేటు డీలర్ల వద్ద కొనుగోలు చేసుకోవచ్చు.
- పంటల పెరుగుదలకు వినియోగించే ఎరువుల్లో యూరియా, డీఏపీ, 17-17-17, 19-19-19, 28-28, 14-35-14, 20-0-13, ఎస్ఎస్‌పీ, పొటాష్ వంటి వాటిని కూడా అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో పరీక్ష చేసుకునే వెసులుబాటు ఉంది.
- పంటలకు వ్యాపించే తెగుళ్ల నివారణకు ఉపయోగించే పురుగుమందుల నాణ్యతను కూడా పరీక్షించవచ్చు. రానున్న రోజుల్లో పురుగు మందుల నాణ్యతను కూడా పరీక్షించేందుకు నియోజకవర్గం కేంద్రాల్లోనే రైతులకు అవకాశం కల్పిస్తారు. అప్పటి వరకు జిల్లా కేంద్రం ఒంగోలు మార్కెట్ యార్డులో పురుగు మందుల నాణ్యతను పరీక్షించేందుకు జిల్లా ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దానితో పాటు ఒంగోలు సంక్షేమ కాంప్లెక్స్‌లో భూసార పరీక్షలు చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో పూర్తి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తర్వాత విత్తనాలు, ఎరువులు, పురుగు మందులతో పాటు భూసార పరీక్షలను కూడా నిర్వహించే అవకాశం ఉంది.



కనిగిరిలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ప్రారంభించిన అధికారులు(ఫైల్)



అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లో నాణ్యతా పరీక్షలు చేస్తున్న అధికారులు

లక్ష మంది రైతులకు మేలు

విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించేందుకు జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశాం. వాటిలో రెండు కేంద్రాల్లో నాణ్యతా పరీక్షలు ప్రారంభమయ్యాయి. మరో నాలుగు కేంద్రాల్లో నిర్మాణం, ప్రారంభోత్సవం పూర్తయింది. ఒకటి రెండు నెలల్లో నాణ్యతా పరీక్షలను మొదలు పెడతాం. డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వలన రైతులకు అందుబాటులోకి ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను తెలుసుకోవడమే కాకుండా పంట నష్టాన్ని నివారించేందుకు ఉపయోగపడుతుంది. జిల్లాలోని లక్ష మంది రైతులకు ఈ అవకాశం మేలు చేస్తుంది.

– ఎస్.శ్రీనివాసరావు, జేడీఏ, ఒంగోలు

సామాజిక సాధికార యాత్రను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే కేపీ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె



జార్జి ఫార్మసీ కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కేపీ, పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలో సోమవారం జరిగే సామాజిక సాధికార యాత్రను నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు చేపట్టి నూటికి నూరుశాతం నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ విజయ సాయిరెడ్డి, మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, డాక్టర్లు, లాయర్లు, టీచర్లు, ఐటీ ఎంప్లాయిస్‌తో సమావేశం అవుతారు. రీజినల్ కోఆర్డినేటర్‌తో ప్రెస్‌మీట్, భోజన విరామం అనంతరం డాక్టర్ శామ్యూల్ జార్జి ఫార్మసీ కాలనీ నుంచి పూలసుబ్బయ్య కాలనీలోని బీసీ భవన్ వద్దకు చేరుకుని నూతన భవనానికి శంకుస్థాపనతోపాటు బీసీ కమ్యూనిటీ లీడర్స్‌తో సమావేశమవుతారు. తరువాత పాదయాత్రగా చిల్డ్రన్‌పార్కు వద్దకు చేరుకుని ఎస్సీ కమ్యూనిటీ లీడర్స్‌తో సమావేశం జరుగుతుంది. అనంతరం కంభం సెంటరులోని షాదీఖానా వద్ద ముస్లిం కమ్యూనిటీ లీడర్స్‌తో సమావేశం, పాత బస్టాండులోని వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుని బహిరంగ సభను ఉద్దేశించి మాట్లాడతారని తెలిపారు.

ఏర్పాట్లను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి పరిశీలించారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో జార్జి కళాశాల కార్యదర్శి డాక్టర్ ఆదిమూలపు సతీష్, ఏఎంసీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, జేసీఎస్ కన్వీనర్ పత్తి చంద్ర, నాయకులు ఎం.మహేశ్వరరెడ్డి, న్యాయవాది రవీంద్రనాథ్, ఎస్‌టీయూ నాయకులు ఎం.రామాంజనేయులు పాల్గొన్నారు.

నేటి సామాజిక సాధికార యాత్రకు భారీ బందోబస్తు

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో సోమవారం మధ్యాహ్నం నుంచి జరగనున్న సామాజిక సాధికార సదస్సుకు భారీ స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ తనతోపటు ఐదు మంది సీఐలు, 17 మంది ఎస్సైలు, 37 మంది హెడ్‌కానిస్టేబుల్స్, 225 మంది కానిస్టేబుల్స్, 80మంది హోమ్‌గార్డులతోపాటు స్పెషల్‌పార్టీ, ఎఆర్ పార్టీ, బాంబ్ డిస్పోజబుల్ టీమ్ బందోబస్తులో పాల్గొంటారని చెప్పారు. పోలీసులకు అందరూ సహకరించాలని ఆయన కోరారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించే చర్యలు తీసుకుంటున్నామని డీఎస్పీ తెలిపారు.

టపాసుల తయారీలో జాగ్రత్తలు పాటించాలి

- అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు



టంగుటూరులో టపాసుల ఫ్యాక్టరీని పరిశీలిస్తున్న అడిషినల్ ఏఎస్పీ నాగేశ్వరరావు

టంగుటూరు/మద్దిపాడు: టపాసుల తయారీలో జాగ్రత్తలు పాటించి, ప్రమాదాలు నివారించాలని అడిషినల్ ఎస్పీ నాగేశ్వరరావు అన్నారు. టంగుటూరు, మద్దిపాడు సమీపంలోని టపాసుల తయారీ యూనిట్లను ఆయన డీఎస్పీ రంగస్వామిరెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ వీ శ్రీనివాసరెడ్డితో కలిసి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా యూనిట్లకు సంబంధించి అనుమతులు ఉన్నాయా లేదా అన్న విషయాలను ఏఎస్పీ అడిగి తెలుసుకున్నారు. అనంతరం యూనిట్లలో తయారు చేస్తున్న పలు రకాల ఉత్పత్తులను, వాటిని నిల్వ చేసే గోడౌన్లను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఉండాల్సిన నీరు, ఇసుక ఉన్నాయో లేవో పరిశీలించారు. అనంతరం ఫ్యాక్టరీ యజమానులకు, పనిచేసే సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. తనిఖీల్లో ఆయన వెంట సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, సింగరాయకొండ ఎస్సై ఖాదర్‌బాషా, మద్దిపాడు ఎస్ఐ శ్రీకాంత్, మద్దిపాటు తహసీల్దార్ రజని, ఫైర్ స్టేషను సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పెన్షనర్ల సమస్యలు తీర్చటంలో సంఘం ప్రముఖ పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న సంఘ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: పెన్షనర్ల సమస్యలు తీర్చటంతో ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మంచి కృషి చేస్తుందని వక్తలు అన్నారు. ఒంగోలు భాగ్యనగర్‌లో సంఘ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షుడు సానల విశ్వరూపాచారి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జిల్లాకు మంచి ప్రాముఖ్యతనిచ్చి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంఘ అధ్యక్షుడు విశ్వరూపాచారికి, రాష్ట్ర కార్యదర్శిగా జీ రవీంద్ర నాథ్ రెడ్డికి అవకాశం ఇవ్వటంపై రాష్ట్ర సంఘానికి కృతజ్ఞతలు చెప్పారు. రాష్ట్ర స్థాయి పదవులు పొందిన వారిని ఘనంగా సన్మానించారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పీఎస్ఎస్ ఎన్‌పీ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీ నరసింహారావు, రావుల బాపయ్య, బాపట్ల జిల్లా అధ్యక్షుడు కోడూరి ఏకాంబేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు పి వెంకయ్య, నారాయణ రావులు హాజరై సంఘ ప్రాధాన్యతను, సమస్యలను పరిష్కరించుకోవాల్సిన విధానాన్ని వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరావు, కోశాధికారి వాకా శంకర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు జి రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ బివి సుబ్బారావు, ఒంగోలు యూనిట్ అధ్యక్షుడు ఆళ్ల రఘురామిరెడ్డి, కార్యదర్శి సత్యనారాయణ, కోశాధికారి హనుమంతరావు ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

నరసింహస్వామి భక్త బృందం ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో సింహాచలం దేవస్థానం వారిచే వరాహ లక్ష్మీ నృసింహస్వామి కల్యాణాన్ని ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. వందలాది మంది భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించారు.

– ఒంగోలు మెట్రో

ఎలక్టోరల్ ప్రత్యేక క్యాంపెయిన్ పరిశీలన



క్యాంపెయినింగ్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో నిర్వహిస్తున్న ఎలక్టోరల్ ప్రత్యేక క్యాంపెయిన్‌ను జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు నగరంలోని 143, 71, 72, 73 పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. అనంతరం టంగుటూరు మండలంలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి జరుగుతున్న ప్రక్రియపై ఆరా తీశారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు ఓటరు జాబితాలోని చేర్పులు, మార్పులు, డిలీషన్‌లపై డీఎల్‌ఓలకు పలు సూచనలు చేశారు. నగరంలో ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పాత కూరగాయల మార్కెట్, బండ్లమిట్ట, లాయర్‌పేట, తదితర ప్రాంతాల్లోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. దీనిలో తహశీల్దార్‌లు మురళి, సంజీవరావు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు సంజీవ్, రాజశేఖర్, స్వరూప్, రసూల్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో ఆదాయం



మాట్లాడుతున్న అడిషనల్ డైరెక్టర్ అరుణకుమారి

మార్కాపురం రూరల్: రైతులు పట్టుపురుగుల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని పట్టుపరిశ్రమలశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ పి.అరుణ కుమారి తెలిపారు. మండలంలోని బోడపాడులో పట్టుపురుగుల పెంపకాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. రైతులు సాగుచేసుకుంటున్న మల్బరీ తోటలను అధికారులతో కలిసి సందర్శించి ఆకు నాణ్యతను పరిశీలించారు. రైతు పోతిరెడ్డి రామాంజనేయులురెడ్డి పట్టుపురుగుల పెంపకంలో అవలంబిస్తున్న పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మార్కాపురం పట్టణంలోని పట్టుపరిశ్రమలశాఖ కార్యాలయ ఆవరణలో పట్టు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని రైతులు వినియోగించుకుని అధిక ఆదాయం పొందాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఆర్ఎస్ అనంతపురం డైరెక్టర్ శ్రీనాథ్, జిల్లా పట్టుపరిశ్రమలశాఖ అధికారి సుజయ్‌కుమార్, మార్కాపురం ఏడీ నారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

లాభాల పరిమళం..!

- జిల్లాలో రైతులకు లాభాలు కురిపిస్తున్న పూల సాగు
- గులాబీలు, బంతిపూలు, చామంతులకు పెరిగిన డిమాండ్
- సీజన్ కావడంతో రైతులకు పెరిగిన ఆదాయం



పోరుమామిళ్లపల్లిలో సాగవుతున్న బంతి పూలు

మార్కాపురం: జిల్లా వ్యాప్తంగా పూల సాగు రైతులకు లాభాలు కురిపిస్తోంది. ఇప్పటికే దసరా సీజన్ లాభాలు తెచ్చిపెట్టగా, ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్‌తో పాటు రాబోయే కార్తీకమాసం, అయ్యప్పస్వామి, తదితర మాలధారణలు, దీపావళి, జనవరి 1, సంక్రాంతి పండుగల నేపథ్యంలో పూల సాగు రైతులు మరింతగా లాభాల బాట పట్టనున్నారు. జిల్లా వ్యాప్తంగా 108.44 ఎకరాల్లో పూలసాగు జరుగుతోంది. అందులో పశ్చిమ ప్రకాశంలోని కొమరోలులో 5 ఎకరాలు, గిద్దలూరులో 5, త్రిపురాంతకంలో 5, పెద్దారవీడులో 1.17 ఎకరాలు, బేస్తవారిపేటలో 11.69, మార్కాపురంలో 1.50, పొదిలిలో 1.30, పుల్లలచెరువులో 2, చీమకుర్తిలో 3.38, సీఎస్ పురంలో 7.29, కనిగిరిలో 7.45, కంభంలో ఒక ఎకరాలో, టంగుటూరు, దర్శి, నాగులుప్పలపాడు తదితర ప్రాంతాల్లో కూడా పూల సాగు చేపట్టారు. ఇందులో ప్రధానంగా మేరీ గోల్డ్, మల్లె, లిల్లీ, గులాబీల సాగు ఎక్కువగా ఉంది. ఈ రైతులంతా కూడా ఈ క్రాప్‌లో నమోదు కావడం విశేషం.



పలు రకాల పూల తోటలు

రకరకాల పూల సాగు...

జిల్లాలో మేరీ గోల్డ్ 58.83 ఎకరాల్లో, మల్లె 25.96 ఎకరాలు, లిల్లీ పూలు 23.65 ఎకరాలతో పాటు బంతి, చామంతి, గులాబీ పూలు సాగుచేస్తున్నారు. జిల్లాకు అవసరమైన మేర పూలు లేకపోవడంతో బెంగళూరు నుంచి తెప్పించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జిల్లాలో పూసే పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఇటీవల దసరా సీజన్‌లో బుట్ట బంతి పూలను రూ.250 నుంచి రూ.300కు విక్రయించారు. పావు కిలో చామంతి పూలను రూ.100 చొప్పున విక్రయించారు. ఇదే పరిస్థితి గులాబీ, లిల్లీ పూలకు కూడా ఏర్పడింది. ఇక, రాబోయే కార్తీకమాసంలో సోమవారాలు, కార్తీక పౌర్ణమి, ఏకాదశితో పాటు అయ్యప్పస్వామి భక్తులు కూడా ప్రతిరోజూ ఆలయాలకు పూలమాలలు తీసుకెళ్తారు. దీంతో పాటు పెళ్లిళ్ల ముహూర్తాలు ఎక్కువగా ఉండటంతో కళ్యాణ మండపాల డెకరేషన్లకు ఎక్కువగా పూలు వాడుతుంటారు. ఇళ్లల్లో జరిగే పూజా కార్యక్రమాలకు కూడా పూలను ఎక్కువగానే వాడుతున్నారు. దీంతో పూలకు మంచి డిమాండ్ ఏర్పడింది. కంభం మండలం పోరుమామిళ్లపల్లి, దొనకొండ ప్రాంతాల్లో పూల సాగు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు.

ఈ క్రాప్ నమోదు పూర్తి



జిల్లాలో పూలసాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. 108.44 ఎకరాల్లో పూలు సాగుచేసిన రైతుల వివరాలను ఈ క్రాప్‌లో నమోదు చేశాం. పూల దిగుబడి ఎకరాకి 4 నుంచి 6 టన్నుల వరకూ వస్తోంది. కోసిన పూలను తడి గోనె సంచుల్లో, వెదురుబుట్టల్లో నింపి పైన తడిబట్ట లేదా పాలిథిన్ షీట్ కప్పి రవాణా చేయాలి. బంతి పూలు బాగా విచ్చుకున్న తర్వాతే కోయాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే పూలు కోయాలి. కోతకు ముందు నీటి తడి ఇస్తే కోత తర్వాత పూలు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి. బంతి తోటల్లో కలుపు రాకుండా చూసుకోవాలి.

– గోపీనాథ్, జిల్లా హార్టీకల్చర్ ఆఫీసర్, ఒంగోలు

ఎకరా బంతి, ఎకరా రోజా పూలు సాగు చేశా

ఈ ఏడాది నేను ఎకరా పొలంలో రోజా పూలు, మరో ఎకరాలో బంతి, చామంతి పూలు సాగుచేశా. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. పండుగ సీజన్లు కావడంతో మార్కెట్‌లో ధర కూడా బాగానే ఉంది.

– వెంకట రమణమ్మ, పోరుమామిళ్లపల్లి, కంభం మండలం

చట్టాలపై అవగాహన అవసరం

- సామాన్యులకు సైతం అవగాహన కోసమే గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు
- ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రామకృష్ణారావు



సదస్సులో మాట్లాడుతున్న లా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ రామకృష్ణారావు

ఒంగోలు సెంట్రల్: సామాన్యులకు సైతం చట్టాలపై అవగాహన కల్పించేందుకే గ్రామ స్థాయిలో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఒంగోలులోని ఇందిరా ప్రియదర్శిని లా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సీవీ రామకృష్ణారావు తెలిపారు. నాగులుప్పలపాడు మండలంలోని చదలవాడ గ్రామంలో ఆదివారం రాత్రి ఇందిరా ప్రియదర్శిని లా కాలేజీ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చట్టాలపై అవగాహన లేకపోతే ఆర్థికంగా, సామాజికంగా అనేక ఇబ్బందులు ఉంటాయని తెలిపారు. సమాజంలో చట్టాలపై అవగాహన ఉన్న వారు భరోసాతో జీవించవచ్చన్నారు. ప్రజావేదికపై మాట్లాడటం ద్వారా మంచి న్యాయవాదులుగా తయారవుతారని చెప్పారు. ప్రిన్సిపాల్ కె.నటరాజ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న కుల గణనతో ప్రతి పుట్టుకకు తల్లిదండ్రుల ఆధార్‌కార్డులు జత చేస్తారని తెలిపారు. తద్వారా భవిష్యత్‌లో న్యాయ వ్యవస్థకు చాలా ఉపయోగం ఉంటుందని చెప్పారు. చదలవాడ గ్రామ సర్పంచ్ వరప్రసాదరావు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా చట్టాలపై అవగాహన పెంచుకుని జీవించాల్సి ఉంటుందన్నారు. ఎంపీటీసీ పమిడిముక్కల శివకృష్ణ మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కల్పించే మంచి కార్యక్రమాన్ని గ్రామస్థాయిలో నిర్వహిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. సంవత్సరంలో కనీసం రెండు సదస్సులు నిర్వహించాలని కోరారు. ఆగ్రోస్ ఏడీ సాయి మురళి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అవసరమైన మంచి కార్యక్రమాన్ని న్యాయ విద్యార్థులు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ సుంకర సాయిబాబ మాట్లాడుతూ నేడు ప్రతి విషయం న్యాయబద్ధత, చట్టబద్ధతపై ఆధారపడి ఉందని, చట్టాలపై అవగాహన కలిగినట్లయితే సమాజంలో ముందుకు సాగవచ్చని అన్నారు. పలువురు న్యాయ విద్యార్థులు విద్యాహక్కు చట్టం, లోక్ అదాలత్, మోటార్ వెహికల్ చట్టం, బాల్యవివాహాల నియంత్రణ చట్టం, పోక్సో చట్టం, ప్రాంసరీ నోట్ రాయించుకునే విధానం, భూ పత్రాల బదలాయింపు, ఇతర చట్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. న్యాయ విజ్ఞాన సదస్సు సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రెండు ఇళ్లలో చోరీ

- రూ.1.73 లక్షల నగదు అపహరణ
- త్రిపురాంతకంలో ఘటన



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీమ్

త్రిపురాంతకం: పట్టపగలు రెండు ఇళ్లలో దొంగతనం జరిగి రూ.1.73 లక్షల నగదుతో పాటు బంగారు నగలు చోరీకి గురైంది. త్రిపురాంతకంలోని బ్రహ్మంగారికాలనీలో రెండు పక్క పక్క ఇళ్లలో ఈ చోరీ జరిగింది. దగ్గుపాటి నారాయణ ఇంట్లో రూ.1.25 లక్షల నగదు, మూడు తులాల బంగారు నక్లీసు, అద్దంకి రామాంజనేయులు ఇంట్లో రూ.48 వేల నగదు, బంగారు కమ్మలు రెండు జతలు, ఒక జత మాటీలు, చిన్న ఉంగరాలు నాలుగు అపహరణకు గురైనట్లు బాధితులు తెలిపారు. వీరిద్దరూ హోటల్స్ నిర్వహిస్తూ జీవిస్తుంటారు. వర్షం వస్తుందని ఇంటికి వెళ్లేసరికి ఇళ్ల తాళాలు పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. క్లూస్ టీమ్ చేరుకుని వివరాలు సేకరించింది. స్థానిక ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

తర్లుపాడు: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం అర్ధరాత్రి తర్లుపాడు మండలంలోని కలుజువ్వలపాడులో చోటుచేసుకుంది. తర్లుపాడు ఎస్సై వేముల సుధాకర్, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... గుంటూరుకు చెందిన బాలయ్య (50)ను స్థానిక మొబైల్ క్యాంటీన్ ఓనర్ వెలుగొండారెడ్డి మూడు రోజుల క్రితం నెలవారీ జీతానికి వంటమాస్టర్‌గా నియమించుకున్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి పనిముగించుకుని విద్యుత్ ప్లగ్ తీసేందుకు ప్రయత్నించగా, షాక్ కొట్టి బాలయ్య తీవ్రంగా గాయపడ్డాడు. క్యాంటీన్ నిర్వాహకులు 108కు ఫోన్ చేయడంతో వెంటనే అక్కడికి చేరుకున్న సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తర్లుపాడు ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. కాగా, తనకు కుటుంబసభ్యులు ఎవరూ లేనట్లు మృతుడు బాలయ్య చెప్పినట్లు క్యాంటీన్ నిర్వాహకుడు తెలిపాడు. గుంటూరులోని గాంధీపార్కు సమీపంలో అడ్డకూలీగా పనిచేస్తున్న బాలయ్యను తన సహాయకుడిగా పనిచేసేందుకు మూడు రోజుల క్రితమే నెలవారీ జీతానికి నియమించుకున్నట్లు చెప్పాడు. ఈ నేపథ్యంలో మృతుడి వివరాలు తెలిసిన వారు 91211 02176 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై కోరారు.



బాలయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సుధాకర్

బీసీ సంఘ నూతన కమిటీలు ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేసిన నూతన కమిటీలతో రాష్ట్ర కమిటీ బాధ్యులు

ఒంగోలు సెంట్రల్: బీసీ సంక్షేమ సంఘం ప్రకాశం జిల్లా, ఒంగోలు నగర నూతన కార్యవర్గాల ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. సంఘ రాష్ట్ర సమన్వయకర్త గోనుగుంట బ్రహ్మానందశర్మ అధ్యక్షత వహించగా, రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీలు ప్రమాణస్వీకారం చేశాయి. జిల్లా నూతన అధ్యక్షునిగా బలగాని ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా బెల్లంకొండ నాగరాజు, కార్యనిర్వాహక అధ్యక్షునిగా దోమల పుల్లయ్య, ఉపాధ్యక్షునిగా పి.శివనాగరాజు, అధికార ప్రతినిధి, మహిళా ప్రతినిధిగా దేవకంపాటి శ్రీదేవి, సోషల్ మీడియా ఇన్‌చార్జిగా అలుగుపల్లి శివకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా ఒంగోలు నగర నూతన అధ్యక్షునిగా మెతె భాస్కర్, ప్రధాన కార్యదర్శులుగా పోతులూరి శివబ్రహ్మాచార్యులు, షేక్ అజీజ్, ఉపాధ్యక్షుడు, కోశాధికారులుగా షేక్ షఫీ, పాలెపు వెంకటేశ్వర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, ఉపాధ్యక్షుడు బండారు సోమరాజు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

కనిగిరి రూరల్: నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అక్రమంగా విక్రయిస్తున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు సెబ్ సీఐ అబ్దుల్ జలీల్ ఆదివారం రాత్రి తెలిపారు. ఆ వివరాల ప్రకారం పట్టణానికి చెందిన నూకల హరికృష్ణ డ్రైవర్ ఇతర రాష్ట్రాలకు చెందిన ఎన్‌డీపీఎల్ మద్యం బాటిళ్లు తెచ్చి పట్టణంలో అక్రమంగా విక్రయిస్తున్నాడు. ఆ సమాచారం అందడంతో సెబ్ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. హరికృష్ణ వద్ద నుంచి సుమారు రూ.22 వేల విలువైన 12 మద్యం ఫుల్ బాటిళ్లు, రూ.40 వేల విలువైన మోటార్ బైక్, రూ.50 వేలు విలువ చేసే యాపిల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు.



నిందితుడు, బైక్, మద్యం బాటిళ్లతో సెబ్ సీఐ జలీల్, సిబ్బంది

బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్
- పీసీపల్లి, కనిగిరి మండలాల్లో బస్సు యాత్ర సమాయత్త సభలు
- పట్టణంలో బహిరంగ సభ వేదిక ఏర్పాట్ల పరిశీలన
- 8న కనిగిరి బహిరంగ సభలో 20 వేల మంది హాజరుకు ప్రణాళిక




పట్టణంలో బహిరంగ సభ వేదికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్, పార్టీ శ్రేణులు

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ చేపట్టిన సామాజిక, సాధికార బస్సు యాత్ర విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని ఎమ్మెల్యే, ఎస్జీ రంగా వర్సిటీ బోర్డు మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. పీసీపల్లి మండలంలో పార్టీ శ్రేణులతో, కనిగిరి వైఎస్సార్ భవన్‌లో పార్టీ యూత్ నాయకులు, మహిళా నాయకులు, పట్టణ ముఖ్య నాయకులతో సమావేశం ఆదివారం నిర్వహించారు. అనంతరం స్థానిక చర్చి సెంటర్‌లో జరిగే బహిరంగ సభ వేదికను ఎమ్మెల్యే బుర్రా పార్టీ శ్రేణులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అత్యంత మేలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జనాభాలో 60 శాతం ఉన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్నారన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమానికి అవిరళ కృషి చేశారన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు చెప్పేందుకే సామాజిక, సాధికార బస్సు యాత్ర అని వివరించారు.

8న బహిరంగ సభలో 20 వేల మంది హాజరుకు చర్యలు:

ఈనెల 8న బుధవారం సాయంత్రం 4 గంటలకు కనిగిరి పట్టణంలోని చర్చి సెంటర్లో జరిగే బస్సు యాత్ర, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బుర్రా పిలుపునిచ్చారు. బహిరంగ సభకు సుమారు 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల ప్రజా ప్రతినిధులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరక్టర్లు, సీనియర్ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన వారందరూ క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే బుర్రా పార్టీ నాయకులకు, పార్టీ ప్రజా ప్రతినిధులకు, పలు సూచనలు చేశారు. బహిరంగ సభ ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, జెడ్పీటీసీ ఓకేరెడ్డి, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, అత్యాల జఫన్య, చెరుకూరి సతీష్ చౌదరి, గుర్రం మాల్యాద్రి, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, బత్తుల అంజయ్య, వాసవీ సత్ర సముదాయ జాతీయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు, సీహెచ్ సాల్మన్, పులి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్‌రెడ్డి, ఆర్ మాణిక్యరావు, పార్టీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి పెరుగుమురళి, గంగసాని హుస్సేన్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు జీ బొర్రారెడ్డి, సంగు సుబ్బారెడ్డి, భవనం కృష్ణారెడ్డి, తమ్మినేని సుజాత రెడ్డి, మహిళా నాయకులు కనమర్లపూడి లక్ష్మీ మోహన్, దుర్గమ్మ, భాగ్యమ్మ, దాసరి పద్మ, షఫీ జాస్మిన్, దేవకి సత్యవతి, వేల్పుల వెంకటేశ్వర్లు, ఖాశింసా, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, మాజీ ఎంపీటీసీ జిలాని, బసిరెడ్డి పిచ్చిరెడ్డి, డాక్టర్ రసూల్, నక్కా రామకృష్ణ, రామనబోయిన శ్రీను, బాదం సత్యం, ఎస్‌కే ఖాజా, తిరుపతయ్య, మీరావలి, నాగూర్‌బీ, భారతీ, డీవీ సుబ్రహ్మణ్యం, మేకల మాల్యాద్రి, శీలం సుదర్శన్, మహేష్ నాగ్, సిరుప గోవర్ధన్‌రెడ్డి, దేవకి రాజీవ్, దేవకి సుబ్రహ్మణ్యం, ఖాశింసా, డాక్టర్ రసూల్, మాలీ, కంటు గురవయ్య పాల్గొన్నారు.



పీసీపల్లి సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

ఏఎన్ఆర్ నంది పురస్కారం అందుకున్న కోటయ్య

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడుకు చెందిన చింతం కోటయ్య అక్కినేని నాగేశ్వర రావు శతజయంతి వేడుకల్లో భాగంగా ఏఎన్ఆర్ సాంస్కృతిక విభాగంలో నంది అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని చిక్కడపల్లి త్యాగరాయ గానసభ ప్రధాన వేదికలో కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డు అందుకున్నారు. ఈ సభలో ఏపీజే అబ్దుల్‌కలాం ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. త్యాగరాజు గానసభ అధ్యక్షుడు రాజు, తెలంగాణ మానవ హక్కుల కమిటీ చైర్మన్ కే సూర్యనారాయణ చేతుల మీదుగా అవార్డును కోటయ్య అందుకున్నారు.



ఏఎన్ఆర్ నంది అవార్డు అందుకుంటున్న కోటయ్య

క్లుప్తంగా

పందెం ఎద్దు ఆకస్మిక మృతి

- రూ.25 లక్షల నష్టం
- వంద పోటీల్లో విజేతగా నిలిచిన ఎద్దు



మృతిచెందిన ఎద్దు

కురిచేడు: ఎడ్ల బండ లాగుడు పోటీల్లో వందసార్లు విజేతగా నిలిచి యజమానికి ప్రథమ బహుమతి అందించిన కీర్తిప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఎద్దు ఆదివారం ఆకస్మికంగా మృతి చెందింది. స్థానిక రైతు కాటం పెద్దిరెడ్డి త్వరలో జరిగే ఎడ్ల పోటీల కోసం ఎడ్లకు శిక్షణ ఇస్తున్నారు. ఆదివారం శిక్షణకు వెళ్లివచ్చిన ఎద్దు పడుకుంది. కొంత సమయం తర్వాత దాణా పెట్టేందుకు వెళ్లి చూడగా ఎద్దు మృతి చెంది ఉంది. 7 సంవత్సరాల నుంచి ఇప్పటి వరకు సుమారు 100 పోటీల్లో ఈ ఎద్దు విజేతగా నిలిచిందని, ఎద్దు మృతితో రూ.25 లక్షల నష్టం వాటిల్లిందని పెద్దిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యుల్లో ఒకరిగా చూసుకుంటున్న ఎద్దు మృతి చెందడం ఆ రైతు కుటుంబంతో పాటు గ్రామస్తులు తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మృతిచెందిన ఎద్దుకు అంతిమయాత్ర నిర్వహించారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఎంపికలు రేపు

ఒంగోలు సెంట్రల్: ఉమ్మడి ప్రకాశం జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఎంపికలను మంగళవారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కె.వనజ తెలిపారు. జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలలకు చెందిన అండర్-14, అండర్-17 బాలబాలికలు పాల్గొనాలని కోరారు. కరాటే ఎంపికలను స్థానిక పేర్నమిట్టలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు మోహనరావు (98852 08991)ను సంప్రదించాలని కోరారు.

8 మంది జూదరుల అరెస్ట్

అర్ధవీడు (కంభం): అర్ధవీడు మండలంలోని రెండు గ్రామాల్లో పేకాటస్థావరాలపై పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై నాగమల్లేశ్వరరావు తెలిపారు. అచ్చంపేట గ్రామంలో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,160, దొనకొండ గ్రామ శివార్లలో దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.2,250 స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.